సాక్షి కరీంనగర్

బుధవారం : 24 : జూలై : 2024



ఆదాయం పెంచాలి

స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య సూచించారు. మంగళవారం ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు.

- IIలో



ఎస్ఈగా రాజ్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఇన్‌చార్జి ఎస్ఈగా రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈఈగా బదిలీపై వచ్చిన ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గరిష్టం/కనిష్టం
28.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సర్కిల్‌లో 189 కెపాసిటర్ బ్యాంకులు

- ఎస్ఈ వడ్లకొండ గంగాధర్



కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలో 189 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు టీజీఎస్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో 12 కెపాసిటర్ బ్యాంకులు పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కరెంట్ ఓల్టేజీలో హెచ్చు తగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కెపాసిటర్ బ్యాంకులు పెట్టడం వలన సబ్‌స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రించబడుతుందని వివరించారు. వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్లకు లోఓల్టేజీతో మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడతాయని అన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫాక్టర్ ఘననీయంగా మెరుగుపరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహదపడతాయని, సాంకేతికంగా నష్టాలు తగ్గుతాయని, పరికరాల మన్నిక కూడా చాలా కాలం పెరుగుతుందని ఎస్ఈ పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



కరీంనగర్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమయంలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశనుంచి జీవితంలో స్థిరపడే వరకు ఏదోఒక చట్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలన చట్టం, మాదకద్రవ్యాల నిర్మూలన, పోక్సో చట్టం, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలసదన్, శిశుగృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన సేవలు అవసరమున్నా సంప్రదించాలని నిర్వాహకులను ఆదేశించారు. బాలసదన్, శిశుగృహాలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగావకాశాలు

కరీంనగర్ అర్బన్: జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు అడికో ఇన్ప్ ప్రైవేట్ లిమిటెడ్, అక్రాస్ స్కిల్ మేనేజ్‌మెంట్ ద్వారా ఫ్లిప్‌కార్ట్ వేర్‌హౌజ్‌లో ఉద్యోగ అవకాశాలున్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 26న ఉదయం 10గంటలకు స్వశక్తి కళాశాలలోని ఈజీఎంఎం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు. పదోతరగతి, ఆపైన చదివినవారు అర్హులని, వేతనం రూ.13వేల నుంచి రూ.16వేల వరకు ఉంటుందని, 19నుంచి 33 సంవత్సరాల వయసు గలవారు హాజరుకావాలని పేర్కొన్నారు.

26న ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో..

కరీంనగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఐఎఫ్‌బీ సీఎస్సార్ డివిజన్ రిక్రూట్‌మెంట్ ప్లాన్‌లో పని చేయడానికి ఈ నెల 26న ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో ఎస్సారార్ కళాశాల ఎదురుగా గల ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 93907 51312, 72076 59969, 99082 30384 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవోగా శోభారాణి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)గా డాక్టర్ శోభారాణిని నియమిస్తూ వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. శోభారాణి అంతకు ముందు హన్మకొండలో వైద్యురాలిగా విధులు నిర్వర్తించారు. పదోన్నతిలో భాగంగా కరీంనగర్ జీజీహెచ్‌కు బదిలీపై వచ్చారు.



- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మొండిచేయి
- విమానాశ్రయం, ఐఐటీ, ఈఎస్‌ఐ ఆసుపత్రిపై దక్కని హామీ
- కాళేశ్వరం,సింగరేణి విషయంలో లభించని ఊరట
- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు దక్కని ప్రాధాన్యం

ఫ్చ్.. నిరాశే!

కరుణించని నిర్మలమ్మ

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా ఉమ్మడి జిల్లాకు మొండిచేయి చూపారు. జిల్లా వ్యాప్తంగా దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పలుప్రాజెక్టులకు ఎలాంటి మోక్షం లభించకపోవడంతో తాజా బడ్జెట్‌పై పాత జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. విభజన చట్టంలోని హామీలు కూడా అమలు కాకపోవడంతో ఈసారి కూడా పాత జిల్లాకు నిరాశే మిగిలింది. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణ అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టులపై ఎలాంటి కరుణ చూపించకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. – సాక్షిప్రతినిధి,కరీంనగర్

ఐఐటీ



విభజన హామీల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఐఐటీ ఇవ్వాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు పూర్తవుతున్నా.. ఇంతవరకూ ఈ హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ విషయంలో మొన్నటి దాకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల యుద్ధం నడిచినా.. ప్రాజెక్టు సాకారం కాలేదు.

విమానాశ్రయం



ఉమ్మడి జిల్లాకు విమానయానపరంగా ఉన్న ఏకైక ఆశాకిరణం బసంత్ నగర్ ఎయిర్‌పోర్టు. దీనిని పౌర విమానాశ్రయంగా తీర్చిదిద్ది ఉడాన్ పథకంలో చోటు కల్పించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఈ ప్రతిపాదనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోకపోవడంతో విమానాశ్రయం విషయంలో ఎలాంటి పురోగతి లేదు.



బీజేపీ తెలంగాణకు వ్యతిరేకం

బీజేపీ ఎప్పటిలాగే తెలంగాణపై తన వ్యతిరేకతను మరోసారి చాటుకుంది. ఏపీకి భారీగా నిధులు ఇచ్చి తెలంగాణకు మొండిచేయి చూపింది. స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లాకు నిధులు తేవడంలో విఫలమయ్యారు. జిల్లాకు కావాల్సిన పనులపై ముందుగానే మేం లేఖరాసినా పట్టించుకోలేదు. దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేయడం మినహా తెలంగాణకు చేసిందేమీ లేదు గుండుసున్నా తప్ప.

– పొన్నంప్రభాకర్, మంత్రి

ఈఎస్‌ఐ ఆసుపత్రి



ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది కార్మికులున్నారు. బీడీ, గ్రానైట్, చేనేత, సింగరేణి కాంట్రాక్ట్, ప్రైవేటు టీచర్లు లక్షలాదిమందికి వేతనాల నుంచి నెలనెలా ఈఎస్‌ఐ కట్ అవుతుంది. కానీ... ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక్కటైనా ఈఎస్‌ఐ ఆసుపత్రి లేదు. రామగుండంలో డిస్పెన్సరీ మాత్రమే ఉంది. కార్మికుల భార్యలు, పిల్లలు సరైన వైద్యసేవలు పొందలేకపోతున్నారు. ఈసారి కూడా బడ్జెట్‌లో మొండిచేయే దక్కింది.

కాళేశ్వరం జాతీయ హోదా



ఐదేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలోనే కాదు.. దేశంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఇది. మేడిగడ్డ పిల్లర్లు కుంగడంతో తీవ్ర అపవాదు మూటగట్టుకున్న ఈ ప్రాజెక్టుకు ఈసారి కూడా కేంద్రం నుంచి ఎలాంటి సాయం లభించలేదు.

సింగరేణి ఆదాయపు పన్ను



సింగరేణి కార్మికులు ఆదాయపుపన్ను విషయంలో దశాబ్దాలుగా మినహాయింపు కోరుతున్నారు. కానీ.. ఈసారి కూడా బడ్జెట్‌లో వారికి ఊరట లభించలేదు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కార్మికులంతా మరోసారి ఉసూరుమన్నారు.

▼ బీజేపీ వైఖరి తేటతెల్లమైంది



బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపింది. ఏపీకి, బిహార్‌కు నిధుల వరద కురిపించి, తెలంగాణకు బురద చల్లింది. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలు గెలిచినా బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చింది గుండుసున్నానే. సంపన్నులకు రాయితీలు కల్పిస్తూ పేద ప్రజలపై పన్నుపోటుతో కేంద్ర ప్రభుత్వ వైఖరి తేటతెల్లమైంది.

– గంగుల కమలాకర్, ఎమ్మెల్యే, కరీంనగర్

▼ తీవ్ర అన్యాయం జరిగింది



బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. బీఆర్ఎస్‌కు 16ఎంపీ సీట్లు వచ్చి ఉంటే అద్భుతంగా ఉండేది. ప్రాంతీయ పార్టీలే దేశాన్ని ఏలుతున్నాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలే నిదర్శనం. బడ్జెట్‌లో ఏపీకి రూ.15వేల కోట్లు, బిహార్‌కు రూ.30వేల కోట్లు కేటాయించడాన్ని ప్రజలు గమనించాలి. ప్రజలు కాంగ్రెస్‌కు ఎనిమిది, బీజేపీకి ఎనిమిది సీట్లు అందిస్తే అన్యాయం జరిగింది.

– పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే, హుజూరాబాద్

▼ తెలంగాణపై సవతితల్లి ప్రేమ



బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి వివక్ష చూపుతోంది. బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు ప్రయోజనం శూన్యం. పదేళ్లుగా ప్రతీ బడ్జెట్‌లో మొండిచేయి తప్పడంలేదు. రాష్ట్రం నుంచి ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదు. తెలంగాణపై కేంద్రం మొదటి నుంచి సవతితల్లి ప్రేమ చూపుతోంది.

– మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే, చొప్పదండి

▼ పేదలపై దయలేదు



కేంద్ర ప్రభుత్వం మరోసారి పేదలపై కర్కశత్వాన్ని చూపింది. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరే విధంగా బడ్జెట్ ఉంది. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ నిధులు లేకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

– కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, మానకొండూర్

▼ వికసిత్ భారత్ లక్ష్యంగా..



వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. నిరుద్యోగులు, రైతులు, గ్రామీణాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యం ఇచ్చి బడ్జెట్లో తగిన నిధులు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిది ప్రధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. పేదలకు అండగా బడ్జెట్ రూపొందించారు.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

▼ అన్ని సెక్టార్లు ప్రభావితం



కేంద్ర బడ్జెట్లో వికసిత్ భారత్ లక్ష్యంగా అన్ని సెక్టార్లను ప్రభావితం చేస్తూ నిధులు కేటాయించారు. ఆదాయ పన్నుశాఖ విభాగంలో స్లాబ్‌రేట్లను సరళించి ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామికరంగాలకు వెసులుబాటు కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంతో సఖ్యతతో తెలంగాణ అభివృద్ధికి అవసరమైన నిధులు సమీకరించాల్సిన అవసరముంది.

– చిటుమల్ల శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

వరద వెళ్లేదెలా?

- శ్రీనివాసనగర్ కాలనీవాసుల ఇక్కట్లు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ వేడుకోలు

కరీంనగర్ కార్పొరేషన్: స్థానికంగా నెలకొన్న పంచాయితీ.. పట్టించుకోవాల్సిన నగరపాలక సంస్థ అధికారుల ఉదాసీనత.. నివాసగృహాల మధ్య ఏర్పడిన చిన్నపాటి చెరువు.. విజృంభిస్తున్న దోమలు.. వ్యాపిస్తున్న వ్యాధులు.. వెరసి ఆ కాలనీవాసులకు శాపంగా పరిణమించింది. నగరంలోని 32వ డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌కాలనీ వాసుల ఇక్కట్లకు నిదర్శనమిది. నగరశివారులోని ఈ కాలనీలో ఇప్పటికే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. ఆ రోడ్డు, డ్రైనేజీ ముందుకు కొనసాగించకుండా, ఈ కాలనీలోనే ముగించడం సమస్యగా మారింది. అక్కడే ఓ ప్రైవేట్ వ్యక్తి తన సొంత స్థలంలో ప్రహరీ నిర్మించుకున్నారు. దీనిపై ఆ స్థల యజమానికి,కాలనీవాసులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ రోడ్డు, డ్రైనేజీకి అడ్డుగా ప్రహరీ ఉండడంతో, డ్రైనేజీనీళ్ల ముందుకు వెళ్లే దారిలేక గోడకు ఇవతలి వైపు నిలిచిపోతున్నాయి. ఈ సమస్య ప్రస్తుత వర్షాకాలం తీవ్రమైంది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో కాలనీలోని ఇండ్ల నడుమ భారీగా వరదనీరుచేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ముందుకు వెళ్లే దారి లేక వరద, డ్రైనేజీనీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమలు పుట్టుకొస్తున్నాయి. తమ కాలనీలో వ్యాధులు ప్రబలకముందే నీటిని తొలగించేలా చూడాలని నగరపాలకసంస్థ అధికారులను కోరుతున్నారు. డ్రైనేజీ, రోడ్డు కొనసాగింపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.



శ్రీనివాసనగర్ కాలనీలో నిలిచిన వరదనీళ్లు

నవోదయలో ఇంటింటా ఇన్నోవేషన్



ఇన్నోవేషన్ అవగాహన సదస్సులో నవోదయ విద్యార్థులు

చొప్పదండి: జవహర్ నవోదయలో ఇంటింటా ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఇంటింటా ఇన్నోవేషన్ మేనేజర్ శ్రీరాం శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో మణిదీప్, నవోదయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని రుక్మాపూర్ సైనిక శిక్షణ పాఠశాల విద్యార్థులకు కూడా ఇంటింటా ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు.. వైద్యుల బదిలీలు

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి
- బదిలీల ప్రక్రియలో వైద్యులు, సిబ్బంది బిజీ
- వైద్య సేవలపై ప్రభావం.. ప్రజలకు తిప్పలు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కరీంనగర్‌టౌన్: వర్షాలు కురుస్తూ సీజనల్ వ్యాధులు తాండవిస్తోన్న సమయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ బదిలీలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. గతేడాది వరకు వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆధీనంలో నడిచిన జిల్లా ఆసుపత్రి, కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ప్రారంభమైన తర్వాత 2023 నవంబర్ నుంచి డైరెక్టర్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఈ) ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి జిల్లా ఆసుపత్రి పేరును ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)గా మార్చారు. అప్పటి వరకు టీవీవీపీకి చెందిన 60 మందికి పైగా వైద్యులు ఉండగా, అందులో నుంచి సుమారు 30మంది బదిలీపై వెళ్లారు. మరో 30 మంది వైద్యులు ఇక్కడే సేవలందిస్తున్నారు. ఇటీవల వైద్యుల బదిలీలకు టీవీవీపీ కౌన్సెలింగ్ నిర్వహించింది. 20మంది వైద్యులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో బదిలీలు చేయడంతో రోగులు తీవ్ర అవస్థలు పడే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ప్రారంభంలోనే టీవీవీపీ నర్సింగ్ సిబ్బందిని బదిలీ చేశారు. డీఎంఈ నుంచి జీజీహెచ్‌కు సుమారు 200మంది నూతన నర్సింగ్ ఆఫీసర్లను కేటాయించారు. అందరూ కొత్తగా విధుల్లో చేరిన వారే కావడంతో సేవల్లో కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రస్తుతం 4 నర్సింగ్ సూపరింటెండెంట్లతో పాటు 13 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో వైద్య సేవలతో పాటు నర్సింగ్ సిబ్బంది సేవలకు కొరత ఏర్పడింది. ప్రస్తుతం జీజీహెచ్‌లో పనిచేస్తున్న వారిలో చాలా మంది ఉద్యోగాలకు కొత్త కావడంతో సేవలందించడంలో నైపుణ్యత కొరవడుతోందని రోగులు, వారి బంధువులు అంటున్నారు.

ఉన్నతాధికారులను కోరాం

ఇటీవల జరిగిన బదిలీల్లో హుజూరాబాద్ ఆసుపత్రిలో పనిచేసే 10 మంది వైద్యులు ఇతర ప్రాంతాలకు కేటాయించబడ్డారు. అక్కడకు మాత్రం ముగ్గురినే కేటాయించారు. గైనకాలజీ, జనరల్ సర్జరీ, అనస్తీషియా, ఈఎస్‌టీ వంటి ముఖ్యమైన పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం ఒకే గైనకాలజిస్టు ఉన్నారు. పోస్టులన్నీ భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరాం. త్వరలోనే భర్తీ చేస్తారని భావిస్తున్నాం.

– డాక్టర్ కృష్ణప్రసాద్, డీసీహెచ్ఎస్, టీవీవీపీ

వైద్యసేవలకు ఇబ్బంది లేదు

డీఎంఈ నుంచి సరిపడా వైద్యులను కేటాయించారు. టీవీవీపీ నుంచి జరిగిన బదిలీల్లో ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన నలుగురు పీడియాట్రిషన్‌లు ఒకేసారి బదిలీ అయ్యారు. పీడియాట్రిషన్‌లు కావాలని కలెక్టర్‌ను కోరాం. ఆసుపత్రి కెపాసిటీ ప్రకారం నర్సింగ్ సిబ్బంది కూడా సరిపడా ఉన్నారు. వ్యాధుల సీజన్ అయినప్పటికీ సేవలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– డాక్టర్ వీరారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్

నటనలో శిక్షణ

విద్యానగర్(కరీంనగర్): బాలబాలికల్లో స్టేజిఫియర్ పోగొడుతూ, కళా నైపుణ్యం పెంపొందించడానికి నటనలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్క్ ఫిలిం ఇనిస్టిట్యూట్ చైర్మన్ అనసూరి భూనిధచారి తెలిపారు. కరీంనగర్‌లోని రెయిన్‌బో హైస్కూల్‌లో ఆగస్టు 11న నటనలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 6నుండి 13 సంవత్సరాల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేరు నమోదుకు 88015 65909, 94402 15199 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్రీనివాస్ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నర్సయ్యపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన గండ్ల శ్రీనివాస్(27) మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి కొన్ని కారణాలతో మానేశాడు. మరో ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. అయితే, బయటకు వెళ్లి వస్తానని మంగళవారం ఇంట్లో చెప్పాడు. గర్రెపల్లి స్టేజీ నుంచి నర్సయ్యపల్లి వైపు ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో వెళ్తూ కరీంనగర్ వైపు వస్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా స్థానికులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై వ్యక్తి..


దినేశ్ యాదవ్ మృతదేహం

జమ్మికుంట: బిహార్ రాష్ట్రానికి చెందిన దినేశ్ యాదవ్(46) స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం మృతి చెంది కనిపించాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం నలంద జిల్లా పినిపర్ గ్రామానికి చెందిన దినేశ్ యాదవ్(46) కొంత కాలంగా పట్టణంలోని ఓ రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం రైల్వేస్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో పడుకున్నాడు. కాసేపటికే చనిపోయాడు. అనారోగ్యం లేదా ఇతర కారణాలతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

అనారోగ్యంతో గర్భిణి..


ఝాన్సీ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): కడుపులో పెరుగుతున్న బిడ్డను కళ్లారా చూడకుండానే ఓ గర్భిణి అనారోగ్యంతో మృతిచెందింది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం మద్దికుంటకు చెందిన ఝాన్సీ అలియాస్ ఐశ్వర్య (20)కు గూడెం గ్రామానికి చెందిన ఈడుగురాళ్ల అంజయ్య, విజయ దంపతుల కుమారుడు హరీశ్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. ఝాన్సీ ప్రస్తుతం 7 నెలల గర్భిణి. ఇటీవలే భర్త ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఝాన్సీ అనారోగ్యానికి గురికాగా నెల రోజులుగా వైద్యం చేయిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. పెళ్లయిన ఏడాదిన్నరకే ఝాన్సీ మృతిచెందడంతో రెండు కుటుంబాలు దుఃఖంలో మునిగాయి. ఆమె కడసారి చూపునకు భర్త దుబాయ్ నుంచి బయల్దేరాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో మంగళవారం కోర్టు నలుగురికి జైలుశిక్ష విధించింది. కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... మద్యంతాగి వాహనాలు నడిపిన 25 మందిని కోర్టులో హాజరుపరిచారు. ఇద్దరికి ఐదురోజులు, మరోఇద్దరికి మూడురోజుల జైలుశిక్షతో పాటు రూ.7,500 జరిమానా విధించారు. 21మందికి రూ.33వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ వివరించారు.

స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచాలి

- ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- నిధులు సక్రమంగా వినియోగించుకోవాలి
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, చిత్రంలో ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ స్మితాసబర్వాల్, కలెక్టర్ పమేలా సత్పతి, పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ



కరీంనగర్: గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధశాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు–బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా స్థానికసంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగం అవుతున్నాయా లేదో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అధికారులు ఇచ్చిన సూచనలు సలహాలతో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తామన్నారు.

మంచి కలెక్టర్ దొరకడం అదృష్టం

కరీంనగర్‌కు అన్నిఅంశాలపై అవగాహన ఉన్న మంచి కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందన్నారు.

సరికొత్త ప్రయోగాలు చేయాలి

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్తకొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అన్నారు. ప్రజలకు సేవ చేయడం గొప్ప అనుభూతిని ఇస్తుందని, కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం.రమేశ్, సంకెపెల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీవో రవీందర్, జెడ్పీ సీఈవోలు శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల గృహ నిర్మాణ పాలకవర్గ సభ్యుల ఎంపిక

కరీంనగర్‌క్రైం: జిల్లా కోర్టు న్యాయవాదుల గృహ నిర్మాణ సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదన్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆరు ఓపెన్, జనరల్ పాలకవర్గం సభ్యుల కేటగిరిలో నగునూరి పరమేశ్వర్, పోలు వెంకటరాజకుమార్, సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, చక్రధర్, దాసరి రామిరెడ్డి, పూరెల్ల రాములు ఎన్నికయ్యారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో ధనుక రాజశేఖర్, ఇద్దరు మహిళ పాలకవర్గ సభ్యుల కేటగిరిలో పాత్తూరి భాగ్యలక్ష్మి, మూల తిరుమలదేవి ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సహకార సంఘంలో మొత్తం 341 మంది సభ్యత్వం కలిగి ఉండగా.. 288 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 8 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు.

‘మద్యం సిండికేట్’ వేధింపులు

- భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్న
- ఎలుకలమందు తాగిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు
- సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో వైరల్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మియ్యాపూర్(పెర్కపల్లి) గ్రామానికి చెందిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు సంతోష్ మద్యం సిండికేట్ వ్యాపారుల వేధింపులు భరించలేక ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం కలకలం రేపింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామంలో కొన్నేళ్లుగా బెల్ట్‌షాపు నడుపుతూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. ఈ ఆరోపణలను బాధితుడు తన వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. దీనిని చూసిన వ్యాపారులు.. స్టేటస్‌లో ఎందుకు పెట్టావని ఫోన్‌చేసి బెదిరించారు. తనకు మద్యం ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోతున్నానని, అందుకే మనస్తాపం చెంది కూల్‌డ్రింక్స్‌లో ఎలుకల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకుంటున్నాని, తన చావుకు మద్యం వ్యాపారులే కారణమని సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేశాడు. గమనించిన స్థానికులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించాడు. సంతోష్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎక్సైజ్ సీఐని సంప్రదించగా, మద్యం సిండికేట్ లేదన్నారు. దుకాణాదారులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తే షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు.


సెల్ఫీ వీడియో తీస్తున్న సంతోష్

చైన్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లో ఇటీవల ఒక యువకుడి మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన కేసులో ఇద్దరిని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరేందర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న రాత్రి కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన పిట్టల సుమంత్ కోతిరాంపూర్‌లో జరుగుతున్న బోనాల జాతరకు స్కూటీపై వెళ్లాడు. తెల్లవారు జామున తిరిగి కట్టరాంపూర్ వస్తుండగా తిరుమల నగర్ వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అతన్ని వెంబడించి, దాడి చేశారు. సుమంత్ మెడలోని చైన్‌ను బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. 4 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఉజ్వల పార్కు వద్ద వన్ టౌన్ సీఐ సరిలాల్ మంగళవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా హైదరాబాద్ టోలిచౌకిలోని హకీంపేటకు చెందిన మహమ్మద్ ఫైజాన్, మానకొండూర్‌కు చెందిన షేక్ షాహిద్‌అలీలు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి, తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. వివరాలు అడగగా ఓ యువకుడి వద్ద నుంచి దొంగలించామని ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సరిలాల్, ఎస్సై రవి, క్రైం టీం సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేందర్

మహిళపై గొడ్డలితో దాడి

- తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): తనను అకారణంగా దూషించిందనే నెపంతో ఓ వ్యక్తి దాడిచేయడంతో తుంగాపిండి రాజమ్మ(55) తీవ్రగాయాల పాలైంది. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 39వ డివిజన్ మాతంగికాలనీలో మంగళవారం ఈఘటన చోటు చేసుకుంది. రాజమ్మ ఇంటి సమీపంలోనే ఉండే ఓ వ్యక్తి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దాడి ఘటనపై ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మూడోసారి చావుదే పైచేయి

- ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కమాన్‌పూర్(మంథని): పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన ధనపునేని అనిల్(30) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అనిల్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇప్పటికే రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. అప్పుడు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. కానీ, మూడోసారి చావు తప్పలేదు. సోమవారం సాయంత్రం మరోసారి పేరపల్లి గ్రామ శివారులో గడ్డిమందుతాగి పడిపోయాడు. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలో పడి గూర్ఖా మృతి

ధర్మపురి: నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నేపాల్‌లోని దొట్టి జిల్లా కిషింగ్ గ్రామానికి చెందిన లోకేందర్ కున్వర్ (60) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఏఎస్సై రాజు కథనం ప్రకారం.. కున్వర్ తండ్రి చనిపోవడంతో ధర్మపురి మండలం జైనాలో మూడేళ్లుగా గూర్ఖాగా పనిచేస్తున్నాడు. గ్రామస్తులు ఇచ్చే డబ్బులతో పొట్టపోసుకుంటున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు దిలీప్‌సింగ్ కున్వార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ హుండీని పగులగొట్టి అందులోని రూ.5వేలు అపహరించుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యుడు గోదారి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వి.రవి వెల్లడించారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- పలువురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల ప్రధాన రహదారిలో చంద్రంపేట నుంచి రగుడు వెళ్తున్న ఆటో కుక్కను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల వివరాలు.. చంద్రంపేట గ్రామానికి చెందిన సలేంద్రి ఎల్లయ్య, కర్రె పోచవ్వ, కర్రె రామచంద్రం ఆటోలో వెళ్తుండగా రగుడు సమీపంలో ఎదురుగా కుక్క రావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎల్లయ్య, పోచవ్వ, రామచంద్రం గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, టెక్నీషియన్ ప్రవీణ్, పైలట్ నరేశ్ ఘటన స్థలానికి బాధితులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన వారిని ‘108’లో తరలిస్తున్న సిబ్బంది


బోల్తాపడిన ఆటో

ఇందారంలో రోడ్డు ప్రమాదం.. మైదంబండలో విషాదం


అజయ్(ఫైల్)

ముత్తారం(మంథని): మంచిర్యాల జిల్లా ఇందారం సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తారం మండలం మైదంబండకు చెందిన మచ్చ అజయ్(22) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పంచాయతీ కార్మికుడిగా పనిచేసే మచ్చ లక్ష్మణ్– పద్మ దంపతులకు ఒక కొడుకు అజయ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆడపిల్లలకు వివాహాలు అయ్యాయి. పదో తరగతి వరకు చదివిన అజయ్ గోదావరిఖనిలో మెకానిక్ పనినేర్చుకుని అక్కడే కారు షోరూంలో కొంతకాలం పనిచేశాడు. కొద్దిరోజులుగా మెట్‌పల్లిలోని కారు షోరుంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంచిర్యాలకు చెందిన ఓ వ్యక్తి కారు మరమ్మతు చేసిన అజయ్.. దానిని అప్పగించేందుకు సోమ వారం రాత్రి బయలు దేరి వెళ్త ఒడగా ఇందారం వద్ద గోదావరిఖని వైపు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి అజయ్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నుజ్జునుజ్జు అయ్యింది. కొడుకు మెకానిక్‌గా పేరు తెచ్చుకుని వృద్ధాప్యంలో తమను పోషిస్తాడనే గంపెడాశతో ఉన్న తమకు శోకమే మిగిల్చాడని తల్లిదండ్రులు రోదించారు.

స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్: దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన స్మితాసబర్వాల్, సినీ డైరెక్టర్ ఎస్ఎస్. రాజమౌళిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మొగిలి లక్ష్మయ్య, ఎస్.జగదీశ్వరచారి డిమాండ్ చేశారు. మంగళవారం వారు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేశారు. ఉన్నత హోదాలో ఉండి దివ్యాంగుల మనోభావాలు కించపరిచే విధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అంతకు ముందు వారు కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంది నాగరాజు, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల పట్టభద్రుల సంఘం నాయకులు

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం


బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు, చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- ఆల్ఫోర్స్(ఎన్ఎస్‌వీ) స్కూల్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

మల్యాల: మల్యాల మండలంలోని ఆల్ఫోర్స్(ఎస్ఎస్‌వీ) స్కూల్‌లో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. డప్పుచప్పుళ్ల మధ్య విద్యార్థుల సంప్రదాయ దుస్తులు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర

జగిత్యాల: ఆషాఢమాసం పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి బోనం ఎత్తుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కరాటేలో ‘అచీవర్స్’కు పతకాలు

కరీంనగర్: పట్టణంలోని కోతిరాంపూర్‌లో గల అచీవర్స్ యాక్టివ్ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే టోర్నమెంట్‌లో పతకాలు సాధించారు. బి.ఆరాధ్య(ఏడో తరగతి) కటా, వెపన్ విభాగాల్లో బంగారు, రజత, ఎం.తేజ(ఏడోతరగతి) కటా, వెపన్ విభాగాల్లో రెండు రజత, బి.సుభాష్(ఎనిమిదో తరగతి) కటా, కుమిటీ విభాగాల్లో రెండు రజత, ఈ.యశ్వంత్(ఏడోతరగతి) కటా, కుమిటీ విభాగాల్లో బంగారు, కాంస్య, బి.రేవంత్‌కుమార్ (ఎనిమిదో తరగతి) కటాలో బంగారు, కె.చరణ్‌తేజ్(తొమ్మిదో తరగతి) కటా, వెపన్ విభాగాల్లో రజత, కాంస్య, అయాన్(మూడోతరగతి) కటా, కుమిటీ విభాగాల్లో రెండు రజత, సుప్రతిక్ (నాలుగో తరగతి) కటా, కుమిటీ విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. వారిని పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, గోజుర్యు కరాటే డో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురభి వేణుగోపాల్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ వినేశ్ మంగళవారం అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పెద్దపల్లిరూరల్: కనగర్తి గ్రామానికి చెందిన ఏడెల్లి పద్మ ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. పద్మ తన అత్తతో కలిసి పొలంలో వరి నాట్లు వేయిస్తుండగా ఇంటి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఇల్లు కాలిపోతుందనే సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే రూ.లక్ష 20 వేల నగదు, నిత్యావసరాలు, సామగ్రి మంటల్లో కాలిబూడిదైంది. సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారి రాజేందర్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేశ్, శంకర్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.


మంటల్లో కాలిపోయిన ఇల్లు

రౌడీషీటర్లపై నిరంతరం నిఘా

- శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు
- జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ వెల్లడి

జగిత్యాలక్రైం: రౌడీషీటర్లపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నేరాల్లో నిందితులుగా ఉన్నవారు ఆయా పోలీస్‌స్టేషన్‌లలో హాజరుకావాలని, లేకుంటే వారిని బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. రౌడీ, హిస్టరీషీట్స్ ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నేరాలకు దూరంగా ఉంటూ.. సత్ప్రవర్తనతో ఉన్నవారిపై రౌడీషీట్స్ తొలగిస్తామన్నారు. రౌడీ, హిస్టరీ అనుమానాస్పద, మతపరమైన అల్లర్లలో ప్రమేయం ఉన్నవారిని ప్రతినెలా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు.


కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

కరీంనగర్: ఐద్వా రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐద్వా మహిళా సంఘం నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతోందన్నారు. వరకట్న, లైంగిక వేధింపులు, పసి పిల్లలు, వృద్ధులు అని చూడకుండా దుర్మార్గంగా అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా కేసులను వేగంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు. 13 జిల్లాల్లో న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి పథకాలు తీసుకురావాలని కోరారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, జిల్లా నాయకురాలు పాండ్రాళ్ల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మి

18లోగా ట్యూషన్ ఫీజు చెల్లించండి

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆగస్టు 18వ తేదీ వరకు అడ్మిషన్ ఫీజు(ట్యూషన్ ఫీజు) చెల్లించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేశ్, అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.సుబ్బారావు మంగళవారం తెలిపారు. పాఠ్యపుస్తకాలు, ట్యూషన్ ఫీజుతో కలిపి మొత్తం రూ.3,000 ఆన్‌లైన్ లేదా మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని కోరారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్ కౌన్సెలింగ్ తరగతులు ఈనెల 28వ తేదీ నుంచి ప్రతీ ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని వారు వివరించారు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్ల చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ట (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2. **నేపాల్ ఇన్నింగ్స్:** సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ట (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం:** 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మిన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



మరో 2 రోజుల్లో...

సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)




లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కెప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ-రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● సమంత నాని

మరో ప్రేమకథ ఆరంభం


● నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

మేమే... మేమే...


● సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


● అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపోయింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


● హాసినీ సుధీర్